క్లుప్తంగా

పీసా చట్టంపై అవగాహన తప్పనిసరి



పీసా చట్టంపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో సాల్మన్‌రాజు

గుమ్మలక్ష్మీపురం: గిరిజనుల హక్కుల పరిరక్షణకు తీసుకువచ్చిన పీసా చట్టంపై అవగాహన తప్పనిసరిగా కలిగి ఉండాలని ఎంపీడీవో ఎస్.సాల్మన్‌రాజు అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు, మండల స్థాయి అధికారులకు పీసా చట్టంపై గురువారం అవగాహన కల్పించారు. గిరిజనులు, గిరిజన ప్రాంతాల అభివృద్ధికి పీసా చట్టం ఎంతగానో ఉపయోగపడుతుందని, ప్రతిఒక్కరూ ఈ చట్టం గూర్చి తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కుంబురుక దీనమయ్య, వైస్ ఎంపీపీ నిమ్మక శేఖర్, ఈవోపీఆర్‌డీ ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

పీసా చట్టంపై అవగాహన

సీతంపేట: పీసాచట్టంపై అవగాహన పెంచుకోవాలని ఎంపీపీ బి.ఆదినారాయణ అన్నారు. గురువారం స్థానిక వైటీసీలో 41 షెడ్యూల్డ్ పంచాయతీ సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 21 వరకు శిక్షణ కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ కోఆప్షన్ సభ్యురాలు ఎస్.లక్ష్మి, ఎంపీడీఓ గీతాంజలి, ఏపీఎస్ఐఆర్‌డీ పర్యవేక్షకుడు హనుమంతురావు, తదితరులు పాల్గొన్నారు.

జియ్యమ్మవలస: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో టీకేజమ్ము, కొండచిలకాం సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి పీసా చట్టంపై అవగాహన కల్పిస్తూ శిక్షణా తరగతులు గురువారం నిర్వహించారు.

వితరణ

గరుగుబిల్లి: మండలంలోని తోటపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి పార్వతీపురానికి చెందిన కేతిరెడ్డి చేతన్ విఘ్నేష్ దంపతులు కంచుగంటను వితరణ చేశారు. గురువారం ఆలయాన్ని సందర్శించి, స్వామి వారిని దర్శించుకున్న వారు ఆలయ అభివృద్ధి ట్రస్టు సభ్యులకు ఆ గంటను అందజేశారు.

వారపు సంతలో డ్రోన్‌తో నిఘా

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండల కేంద్రంలో గురువారం జరిగిన వారపు సంత నిర్వహణను డ్రోన్ కెమెరాతో పర్యవేక్షించారు. శాంతిభద్రతల పర్యవేక్షణలో భాగంగా డ్రోన్ కెమెరాతో నిఘా పెట్టామని ఎస్ఐ పి.నారాయణరావు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే సంతలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఈ చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

రీ సర్వేను పరిశీలించిన సబ్ కలెక్టర్



రీ సర్వే సిబ్బందితో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్ రెడ్డి

భామిని: మండలంలోని మణిగలో చేపడుతున్న రీ సర్వేను సబ్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్ రెడ్డి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రీసర్వే దరఖాస్తులను తక్షణమే పూర్తి చేయాలని ఆదేశించారు. సర్వే నివేదికలు పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ రాజేశ్వరరావు, డీటీ రమేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.


పోర్టిఫైడ్ రైస్‌తో ఆరోగ్యం



పోర్టిఫైడ్ రైస్‌తో తయారు చేసిన వంటకాలను పరిశీలిస్తున్న పీవో శాంతిభవాని

భామిని: అంగన్‌వాడీ కేంద్రాలకు అందించే ఫోర్టిఫైడ్ రైస్‌తో తల్లీ,పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని సీడీపీఓ శాంతిభవానీ, ప్రాజెక్ట్ ట్రైనర్ వరలక్ష్మి అన్నారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో ఫోర్టిఫైడ్‌తో తయారు చేసిన వంటకాలను గురువారం ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎస్‌ఓలు సబితా పట్నాయక్, జ్యోతిలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు పాల్గొన్నారు.

సరోజినీనాయుడుకు ఘననివాళి



సరోజినీనాయుడు సేవలను కొనియాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీవరం

గుమ్మలక్ష్మీపురం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయోద్యమ నాయకురాలు, ప్రముఖ రచయిత్రి సరోజినీనాయుడు జయంతి గురువారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ టి.శ్రీవరం, వైస్ ప్రిన్సిపాల్ డి.రామయ్య తదితరులంతా సరోజినినాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. దేశ స్వాతంత్ర్యానికి చేసిన సేవలను కొనియాడారు.

జంపరకోటకు మోక్షం లేదా..?

- 1988లో పనులకు శ్రీకారం
- 2006 దివంగత వైఎస్సార్ హయాంలో కీలక పరిణామం
- ఎన్నికల సమయంలో హామీలిచ్చిన కూటమి నాయకులు
- 36 ఏళ్లుగా మినీ రిజర్వాయర్ ఏర్పాటు కోసం ఎదురుచూస్తున్న రైతులు
- తాజా బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని రైతులు, సంఘాల నేతల డిమాండ్



జంపరకోట జలాశయం నిర్మించాల్సిన ప్రాంతం ఇదే

పాలకొండ రూరల్: మండలంలో జంపరకోట వద్ద ఉన్న భౌగోళిక స్థితిగతులు, ఎత్తైన కొండల మధ్య నీటి లభ్యతను ఒడిసి పట్టి దాదాపు 2100 ఎకరాలకు సాగునీరు అందించాలని 1988లో అప్పటి ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలో 0.1 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో జంపరకోట పెద్దగెడ్డపై మినీ జలాశయం పనులకు రూ.2.25 కోట్ల అంచనా వ్యయంతో శ్రీకారం చుట్టింది. ఈ పనులు పూర్తి చేస్తే మండలంలో దాదాపు నాలుగు పంచాయతీలకు సంబంధించి రెండువేల ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉంది. దీంతో వరి, వాణిజ్య పంటలు పుష్కలంగా పండించుకోవచ్చు. 36 ఏళ్ల కిందట ప్రారంభమైన పనుల్లో వివిధ కీలక పరిణామాలు, పలు ప్రభుత్వాలు మారడంతో రిజర్వాయర్ ఏర్పాటు కలగానే మిగిలిపోయింది. తొలినాళ్లలో కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం, లాభాపేక్ష కారణంగా పనులు నత్తనడకన సాగాయి. దాదాపు 18 ఏళ్లు ఈ ప్రక్రియ కొనసాగింది. 2006 వరకూ పనులు పూర్తికపోవడంతో అంచనా వ్యయం పలు దఫాలుగా పెరుగుతూ వచ్చింది.



కరిగిపోయి రూపుకోల్పోయిన మట్టి కట్టడాలు

వైఎస్సార్ హయాంలో కీలక అడుగులు

దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 2006లో ప్రజా ప్రస్థానం కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఎం.సింగుపురం వచ్చారు. ఈ సమయంలో ఈ ప్రాంత నాయుకులు కీర్తిశేషులు పాలవలస రాజశేఖం జంపరకోట జలాశయ ఆవశ్యతక, ఇక్కడి రైతుల సాగునీటి సమస్యలపై వైఎస్సార్‌కు వివరించారు. అదే సమయంలో ఉత్తరాంధ్రలో పెండింగ్‌లో ఉన్న చిన్ననీటి పారుదల ప్రాజెక్ట్ పునరుద్ధరణకు రైతులు, ఆయా సంఘాల నాయకులు అందిస్తున్న వినతులపై దృష్టి పెట్టిన వైఎస్సార్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఈ నేపథ్యంలో జంపరకోట జలాశయం పనులకు నిధులు కేటాయించారు. ఆ సమయంలో రిజర్వాయర్ పనులు జరుగుతున్న చోట భూములు కోల్పోయి పరిహారం కోసం ఆందోళన బాటపట్టిన నిర్వాసితులకు 2011లో పరిహారం అందించడంతో పాటు ఇతర సమస్యల పరిష్కారానికి దివంగత వైఎస్సార్ హయాంలో కీలక అడుగులు పడ్డాయి. పాలవలస కుటుంబం కృషి, రైతుల శ్రమ వెరసి పనులు ఊపందుకున్నాయి. ఈ క్రమంలో వైఎస్సార్ మరణం, పాత ధరలకు పనులు చేయలేమంటూ నాటి కాంట్రాక్టర్లు మొరాయించడంతో మళ్లీ పనులు నిలిచిపోయాయి. పలు దఫాలుగా పనుల్లో సంవత్సరాల తరబడి జాప్యం కొనసాగుతుండడంతో దశల వారీగా చేపట్టిన మట్టి పనులు (కొండల మధ్య నిర్మించిన మట్టి కట్టలు, నీటి మళ్లింపునకు ఏర్పాటు చేసిన కట్టడాల్లో)నాణ్యత లోపించింది. ఈ క్రమంలో భారీ వర్షాలు, తుపానుల కారణంగా ఇదివరకూ చేపట్టిన పనులకు భారీ గండ్లు పడి రూపుకోల్పోవడం జరిగింది. 2018లో టీడీపీ హయంలో మారోమారు పనులు చేపట్టినా పూరిస్థాయి నిధులు అందలేదు. అటుపై వైఎస్సార్‌సీపీ హయాంలో నాటి ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతితో పాటు ప్రస్తుత ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ జంపరకోట జలాశయం పనులు, నేటి స్థితిగతులకు అనుకూలంగా జలాశయం ఆధునీకరణకు నిధులు కేటాయించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. దీనిప్పై స్పందించిన నాటి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత పనుల కోవలోకి జంపరకోటను చేర్చడం, నిధులు అనుకున్న మేరా కేటాయింపునకు చర్యలు చేపట్టే క్రమంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. తాజాగా ఎన్నికల ముందు కూటమి నాయకులు కూడా జలాశయం పూర్తి చేస్తామని హామీలు గుప్పించారు. దీంతో అక్కడి గిరిజన, పరిసర గ్రామాల రైతులతో పాటు ఆయా సంఘాల నాయకుల నేతృత్వంలో ఆందోళన చేపట్టారు. రైతుల సమస్యలను గుర్తించి జలాశయం పనులకు త్వరలో జరగనున్న అసెంబ్లీ సమావేశాల్లో నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చారు..

జంపరకోట జలాశయ నిర్మాణానికి కట్టుబడి ఉంటామని ఎన్నికల ముందు వారాహియాత్రలో భాగంగా ప్రస్తుత డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, యువగళం కార్యక్రమంలో భాగంగా ఇప్పటి ఐటీ మంత్రి నారా లోకేష్ పాలకొండ వచ్చినప్పుడు హామీలిచ్చారు. కూటమి హయాంలో పనులు పూర్తి చేసి చూపిస్తామన్నారు. అధికారం వచ్చి దాదాపు తొమ్మిది నెలలు కావస్తోంది. ఇంతవరకు ఆ ప్రస్తావనే లేదు. కేవలం పోలవరం తప్పితే పాలకొండ ఊసే ఎత్తడం లేదు. రానున్న అసెంబ్లీ సమావేశాల్లో మా ప్రాంత సాగునీటి వనరులపై ప్రస్తావించడంతో పాటు నిధులు కేటాయించాలి. లేకుంటే రైతులతో కలసి ఉద్యమం చేపట్టక తప్పదు. – బుడితి అప్పలనాయుడు, ఏపీ రైతు సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి

రాష్ట్రంలో అరాచక పాలన

- ఎమ్మెల్సీ విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే కళావతి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే కళావతి

వీరఘట్టం: రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి ఆరోపించారు. మండలంలోని అడారు గ్రామంలో గురువారం విలేకరులతో మాట్లాడుతూ.. మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అరెస్ట్ అన్యాయమన్నారు. గన్నవరంలో టీడీపీ కార్యాలయంపై దాడి చేశారంటూ వంశీపై గతంలో ఫిర్యాదు చేసిన వ్యక్తి తన ఫిర్యాదును వెనక్కితీసుకున్నారని, అయితే కూటమి ప్రభుత్వం మాత్రం కక్ష సాధింపు చర్యలకు పాల్పడి వంశీని అక్రమంగా అరెస్ట్ చేసిందని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం పని తీరును ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు బనాయించడం సరికాదన్నారు. సూపర్ సిక్స్ హామీలు నెరవేర్చమని అడగడం తప్పా అని ప్రశ్నించారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మంగా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారన్నారు. ఈ కార్యక్రమం ద్వారా నేరుగా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు, మంత్రులు గ్రామాలకు వెళ్లి స్థానిక సమస్యలు గుర్తించేవారని చెప్పారు. అలాగే సమస్యల పరిష్కారానికి ప్రతి సచివాలయానికి రూ. 20 లక్షలు మంజూరు చేశారన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా చేపట్టిన అభివృద్ధి పనులను కూటమి ప్రభుత్వం రద్దు చేయడం అన్యాయమన్నారు. గత ప్రభుత్వాలు చేసిన అభివృద్ధి పనులను తర్వాత వచ్చిన ప్రభుత్వాలు కొనసాగించాలే తప్ప.. ఇలా అడ్డుకోవడం తగదన్నారు. రెండు జిల్లాల ప్రజలకు జీవనాధారంగా ఉన్న తోటపల్లి పాత ఆయకట్టు కాలువల ఆధునీకరణ పనులు రద్దు చేసి ఈ ప్రాంతంలో అభివృద్ధిని మరింతగా అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

విద్యావ్యవస్థను నాశనం చేస్తున్నారు..

కూటమి ప్రభుత్వం విద్యా రంగంలో చేపపడుతున్న సంస్కరణల వల్ల పేద విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారని ఎమ్మెల్సీ విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే కళావతి ఆవేదన వ్యక్తం చేశారు. పేదలకు చదువును దూరం చేయాలని చూస్తే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 117 జీఓతో కేంద్ర విద్యా విధానానికి అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌స్థాయిలో తీర్చిదిద్దిందని చెప్పారు. విద్యార్థుల భవిష్యత్‌ను, తల్లిదండ్రుల ఆవేదనను ప్రభుత్వం అర్థం చేసుకుని పాఠశాలలను యథావిధిగా కొనసాగించాలని కోరారు.

చదువుతో పాటు ఆరోగ్యంపైనా శ్రద్ధ వహించండి

కొమరాడ: విద్యార్థులంతా చదువుతో పాటు ఆరోగ్యంపైనా ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టరు ఎ.శ్యామ్‌ప్రసాద్ సూచించారు. మండలంలోని విక్రంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన గురువారం సందర్శించారు. తరగతుల వారీగా విద్యార్థులతో ముఖాముఖి సంభాషిస్తూ వివిధ ప్రశ్నల ద్వారా వారి అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులు కూడా అడిగిన వాటికి చక్కగా సమాధానాలు చెప్పడంతో ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థినులు రక్తహీనత బారినపడకుండా చూసుకోవాలని ఆయన తెలిపారు. హిమోగ్లోబిన్ 7 శాతం కన్నా తక్కువ ఉన్న వారంతా పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. హిమోగ్లోబిన్ తక్కువగా ఉన్న విద్యార్థులను ఉపాధ్యాయులు దత్తత తీసుకుని, వారికి పౌష్టికాహారం అందేలా చూడాలన్నారు. ప్రతినెలా వారికి రక్తపరీక్షలు చేయించి, వారి ఆరోగ్యం మెరుగుకు కృషి చేయాలని కోరారు. ఎనీమియా యాక్షన్ కమిటీలో అంగన్‌వాడీ కార్యకర్తలు కీలకపాత్ర పోషించాలన్నారు. కలెక్టరు వెంట జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.తిరుపతినాయుడు, ఎంపీడీవో మల్లికార్జున రావు, ఎంఈవో తిరుపతిరావు, వైద్యాధికారి శిరీష, ఐసీడీఎస్ పీవో సుగుణకుమారి తదితరులు ఉన్నారు.

పని కల్పించమంటే పొమ్మంటున్నారు..

- సంత – నర్సిపురం ఉపాధి వేతనదారుల ఆందోళన



సంత – నర్సిపురంలో ఆందోళన చేస్తున్న ఉపాధి వేతనదారులు


వీరఘట్టం: తమకు ఉపాధి పనులు కల్పించమని అడుగుతుంటే. పనుల్లేవ్.. మీకు దిక్కున్నచోట చెప్పుకోమని ఫీల్డ్ అసిస్టెంట్ అంటున్నాడని మండలంలోని సంత – నర్సిపురం గ్రామానికి చెందిన పలువురు ఉపాధి వేతనదారులు ఆరోపించారు. గ్రామానికి చెందిన పలువురు వేతనదారులు గురువారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. గ్రామంలో ఉన్న ఉపాధి వేతనదారులను మూడు గ్రూపులుగా విభజించారని, వారికి అనుకూలంగా ఉన్నవారికి గ్రామంలోనే పని కల్పిస్తూ, తమలాంటి వారిని వేధిస్తున్నారని ఆరోపించారు. చేసిన పనులకు మస్తర్లు కూడా వేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 45 మంది వేతనదారులకు రోజు తప్పించి రోజు పని కల్పిస్తున్నారని.. ఇదేంటని అడిగితే నాకు నచ్చిన వాళ్లకే పని ఇస్తానని ఫీల్డ్ అసిస్టెంట్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడన్నారు.

అధికారులేమంటున్నారంటే ....

ఈ విషయంపై ఉపాధి హామీ ఏపీఓ జి.సత్యంనాయుడు వద్ద సాక్షి ప్రస్తావించగా గ్రామంలో ఉన్న చెరువులో అందరికీ పని కల్పించాలంటే పని సరిపోవడం లేదన్నారు. అందుకే కొందరికి గ్రామంలో ఉన్న చెరువులో పని కల్పించగా.. మిగిలిన వారికి ఇతర ప్రాంతాల్లో నీటి కుంటలు తవ్వే పనులు అప్పగించామన్నారు. అయితే నీటి కుంటల తవ్వే పని దూర ప్రాంతంలో ఉండడంతో వారు వెళ్లమంటున్నారు. ఏదిఏమైనా క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి వేతనదారులకు పనులు కలిపంచేలా చర్యలు తీసుకుంటామన్నారు. వేతనదారుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఫీల్డ్ అసిస్టెంట్‌పైనా చర్యలు తప్పవన్నారు.

2,500 లీటర్ల బెల్లంఊట ధ్వంసం

జియ్యమ్మవలస రూరల్: మండలంలోని చినమేరంగి గ్రామంలో సారాబట్టీలపై ఎస్ఐ పి.అనీష్ సిబ్బందితో కలిసి గురువారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. మొత్తం 25 డ్రమ్ముల్లో నిల్వ చేసి ఉంచిన 2,500 లీటర్ల బెల్లంఊటను ధ్వంసం చేశారు. ఈ ఘటనకు సంబంధించి, సారా తయారీదారులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.



బెల్లంఊట డ్రమ్ములను కాల్చివేస్తున్న సిబ్బంది

పార్టీ అభివృద్ధికి కృషి చేయాలి

జియ్యమ్మవలస: వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడిగా శిఖబడి గ్రామ సర్పంచ్ కోట రమేష్.. చినమేరంగిలో పార్టీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు, మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణిలను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. తనను పార్టీ మండల అధ్యక్షుడిగా నియమించేందుకు సహకరించినందుకు గాను ఆయన వారికి కృతజ్ఞతలు తెలిపి, సత్కరించారు. పార్టీ మరింత అభివృద్ధికి అహర్నిశలు కృషి చేయాలని, పార్టీ కోసం కష్టపడే వారికి ఎప్పుడూ మంచి గుర్తింపే ఉంటుందని వారు తెలిపారు.

గుమ్మలక్ష్మీపురం: తమను పార్టీ మండల అధ్యక్షులుగా నియమించినందుకు గాను గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాల పార్టీ అధ్యక్షులు ఇంటికుప్పల గౌరీశంకరరావు, కుంబురుక దీనమయ్యలు పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, పార్టీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్ రాజు, మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణిలకు కృతజ్ఞతలు తెలిపారు.



జియ్యమ్మవలస: పార్టీ మండల అధ్యక్షుడిని సన్మానిస్తున్న పరీక్షిత్‌రాజు, పుష్పశ్రీవాణి

గరుగుబిల్లి: పార్టీ మండల అధ్యక్షుడిగా నాగూరుకు చెందిన కేతిరెడ్డి అచ్యుతరావును పార్టీ అధిష్టానం నియమించింది. ఈ మేరకు ఆయన చినమేరంగిలోని పార్టీ క్యాంపు కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు, మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణిలను గురువారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల అనుసారం పార్టీ బలోతానికి కృషి చేయాలని ఆయనకు వారు సూచించారు.

పల్లె పండగ పనులు వేగవంతం

వీరఘట్టం: పల్లె పండగ పనులు త్వరగా పూర్తి చేయాలని మండల ప్రత్యేక అధికారి సాయికృష్ణ చైతన్య సూచించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించి, పల్లెపండగ పనులపై ఆరా తీశారు. అలాగే పీఎం సూర్యఘర్, ఎం.ఎస్.ఎం.ఈ సర్వే, హౌసింగ్ పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో ఎంపీడీఓ బి.వెంకటరమణ, ఇంజినీరింగ్ అధికారులు కల్యాణదుర్గ, వినోద్, తదితరులు ఉన్నారు.


పరామర్శ



సర్పంచ్ మన్మథరావును పరామర్శిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం పుష్పశ్రీవాణి తదితరులు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండలంలోని నీలకంఠాపురం సర్పంచ్ అడ్డాకుల మన్మథరావును, జి.శివడ గ్రామానికి చెందిన పాస్టర్ నిమ్మల లక్ష్మణరావును మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణి గురువారం పరామర్శించారు. మన్మథరావు, లక్ష్మణరావుల మాతృమూర్తులు ఇటీవల మృతి చెందగా వారు చనిపోవడానికి గల కారణాలను వారిని అడిగి తెలుసుకుని, ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే జి.శివడ గ్రామానికి చెందిన పదో తరగతి విద్యార్థిని పువ్వల వాసవి కూడా ఇటీవల చనిపోగా ఆమె ఇంటికి కూడా వెళ్లి, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చారు. ఆమె వెంట ఎంపీపీ శెట్టి పద్మావతి, జెడ్పీటీసీ గొర్లె సుజాత, వైస్ ఎంపీపీ రంగారావు, పార్టీ కురుపాం అధ్యక్షుడు ఇంటికుప్పల గౌరీశంకరరావు, మాజీ ఎంపీపీ అనిమి ఇందిరా కుమారి, ఏఎంసీ మాజీ చైర్మన్ నిమ్మక వెంకటరావు తదితరులు ఉన్నారు.


రోగులకు మెరుగైన వైద్యసేవలు



రోగులతో మాట్లడుతున్న పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి

భామిని: ప్రభుత్వాస్పత్రికి వచ్చే ప్రతి రోగికీ మెరుగైన వైద్యం అందించాలని ఐటీడీఏ ప్రాజెక్ట్ మేనేజర్ వై. యశ్వంత్‌కుమార్ రెడ్డి అన్నారు. మండలంలోని బాలేరు పీహెచ్‌సీని పీఓ గురువారం తనిఖీ చేశారు. రోగులతో మాట్లాడుతూ.. వైద్యసేవలు అందుతున్న తీరుపై ఆరా తీశారు. ఆస్పత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆయన తెలిపారు.

సందర్శన..



సీతంపేట హడ్డుబంగి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను ఐటీడీఏ డిప్యూటీ ఈఓ కేఆర్ ప్రసన్నకుమార్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. తరగతి గదులకు వెళ్లి పదో తరగతి విద్యార్థినులతో మాట్లాడారు. వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని ఉపాధ్యాయులకు సూచించారు. స్టడీ అవర్స్ నిర్వహించాలన్నారు. మెనూ ప్రకారం భోజనం పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బి.ఉమావాణి, తదితరులు పాల్గొన్నారు.

తోటపల్లి ఆలయ ఆదాయం రూ.3.36 లక్షలు

గరుగుబిల్లి: మండలంలోని తోటపల్లి దగ్గరున్న శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ హుండీల్లో భక్తులు వేసిన కానుకల ద్వారా సమకూరిన ఆదాయాన్ని గురువారం లెక్కించారు. 37 రోజులకు గాను మొత్తం రూ.3,36,405 ఆలయ కార్య నిర్వహణాధికారి వీవీ సూర్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖాధికారి బి.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

దరఖాస్తుల ఆహ్వానం

గరుగుబిల్లి: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల/కళాశాలలో ఐదో తరగతి, ఇంటర్మీడియట్‌లలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్.సంధ్యారాణి ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరానికి గాను అతర్హులైన వారంతా మార్చి 6వ తేదీ లోగా హెచ్‌టీటీపీఎస్://ఏపీబీఆర్ఏజీసెట్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్‌ను సంప్రదించి, దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఐదో తరగతిలో ప్రవేశాలకు ఎస్సీ, ఎస్టీలు 2012 సెప్టెంబరు ఒకటో తేదీ నుంచి 2016 ఆగస్టు 31వ తేదీ మధ్యలో జన్మించిన వారై ఉండాలన్నారు. బీసీ, ఓసీ, బీసీసీలు 2014 సెప్టెంబరు 1 నుంచి 2016 ఆగస్టు 31వ తేదీ మధ్యలో జన్మించిన వారై ఉండాలన్నారు. ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకునే వారంతా పదో తరగతి ఉత్తీర్ణత సాధించి ఉండాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సీతంపేట: మండలంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ గోపాలకృష్ణమూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

వినియోగదారులు సహకరించాలి

పాలకొండ రూరల్: వేసవి నేపథ్యంలో పట్టణ, మండల ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించే క్రమంలో 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్వహణ పనులు శుక్రవారం చేపడతామని ట్రాన్స్‌కో ఈఈ టీకేజీకే మూర్తి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ, మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు సరఫరా ఉండదని.. వినియోగదారులు సహకరించాలని కోరారు.

17న నగర పంచాయతీ చైర్మన్ ఎన్నిక

పాలకొండ: పాలకొండ నగర పంచాయతీ చైర్మన్ ఎన్నిక ఈ నెల 17న నిర్వహించనున్నట్లు కమిషనర్ ఎస్. సర్వేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో రెండుసార్లు ఎన్నికల నిర్వహించాలని ఏర్పాట్లు చేసినప్పటికీ వాయిది పడిందని పేర్కొన్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ నెల 17వ తేదీ ఉదయం పది గంటలకు ఎన్నిక నిర్వహిస్తామని తెలిపారు.

ఈగల్ క్లబ్‌ల ఏర్పాటు

జియ్యమ్మవలస: మండలంలోని ఏడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఈగల్(అలర్ట్ యాంటీ నార్కోటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్) క్లబ్‌లు ఏర్పాటు చేసినట్లు చినమేరంగి ఎస్ఐ అనీష్ తెలిపారు. మండలంలోని పెదమేరంగి, చినమేరంగి, కుదమ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలతో పాటు కేజీబీవీ, చినమేరంగి ప్రభుత్వ జూనియర్ కళాశాల, తిరుమలసాయి, సత్యకైలాష్ ఉన్నత పాఠశాలల్లో ఈ క్లబ్‌లు ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. కో–ఆర్డినేటర్‌గా ప్రిన్సిపాల్/ప్రధానోపాధ్యాయుడు, కో–ఆర్డినేట్ సభ్యులుగా ఇద్దరు ఉపాధ్యాయులు, ఎనిమిది మంది విద్యార్థులు ఉంటారన్నారు.

మద్యంసీసాల స్వాధీనం

కొమరాడ: మండలంలోని కూనేరు చెక్‌పోస్ట్ వద్ద ఒడిశా నుంచి అక్రమంగా తరలిస్తున్న 19 మద్యంసీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ నీలకంఠం గురువారం తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి, బొబ్బిలికి చెందిన వ్యక్తిపై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

తోటపల్లి కాలువ పనులు పూర్తి చేయాలి

పాలకొండ: తోటపల్లి కాలువల పనులు పూర్తి చేయాలని రైతు సంఘ నాయకుడు బుడితి అప్పలనాయుడు గురువారం ఒక ప్రకటనలో కోరారు. కూటమి ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడంతో పనులు నిలిచిపోతున్నాయిని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ప్రభుత్వం స్పందించి నిధులు కేటాయించాలని కోరారు.

ఎన్ఎంయూ డిపో కమిటీ ఎన్నిక

పాలకొండ రూరల్: ఏపీ ప్రజా రవాణా సంస్థల్లో ఉద్యోగుల పక్షాన పోరాడే నేషనల్ మజ్దూర్ యూనియన్ పాలకొండ డిపో కార్యిదర్శిగా వావిలపల్లి రాజేష్‌ను సభ్యులు ఎన్నుకున్నారు. గురువారం స్థానిక ఎన్ఎంయూ కార్యాలయంలో జరిగిన ఎన్నికలో కమిటీ అధ్యక్షుడిగా ఎస్టీ రావు, చైర్మన్‌గా ఎం.సుబ్బారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆ సంఘ మన్యం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.శంకరరావు, పి.కోటేశ్వరావుల నేతృత్వంలో నూతన కార్యవర్గం డిపో మేనేజర్ పి.వెంటేశ్వరరావును మర్యదపూర్వకంగా కలిసి సహచర సిబ్బంది అభ్యున్నతికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సభ్యులు ఎం.వైకుంఠరావు, డీవీ.రమణ, కేపీ.ప్రసాద్, ఎంఆర్ మూర్తి, ఎంవీ నాయుడు, చలం తదితరులు పాల్గొన్నారు.

అంతర పంటల సాగుపై అవగాహన

జియ్యమ్మవలస రూరల్: మండలంలోని పెదతుంబలి గ్రామంలో అంతర పంటల సాగుపై గురువారం అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా కలిగే ప్రయోజనాలతో పాటు ప్రకృతి సేద్యంలో అంతర పంటలను ఏ విధంగా సాగు చేసుకోవాలన్న విషయాలను ప్రకృతి వ్యవసాయవ అసోసియేట్ జి.రమణమ్మ వివరించారు. రబీ సీజన్‌లో నువ్వుల పంటతో పాటు గోంగూర, కొత్తిమీర, ముల్లంగి, తోటకూర వంటివి పండించుకోవాలని తెలిపారు. అలాగే ప్రతీ మూడు మీటర్లకు ఒక లైన్ చొప్పున ఆముదం, కట్టిజనుము, కంది, చిక్కుడు, బెండ పంటలు వేసుకోవాలన్నారు.

నిబంధనలు అతిక్రమించొద్దు..

పాలకొండ రూరల్: వాహన చోదకులు నిబంధనలు అతిక్రమించొద్దని ఎస్సై కె.ప్రయోగమూర్తి అన్నారు. సీతంపేట, రాజాం, వీరఘట్టం రహదారుల్లో గురువారం వాహన తనిఖీలు చేపట్టారు. నిబంధనలు ఉల్లంఘించిన వారికి అపరాధరుసుం విధించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.